ఎదురుచూపులు

- ఆరు నెలలుగా పెండింగ్‌లోనే కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ
- అమాత్యుల, అతిథుల రాకకు నిరీక్షణ
- గజ్వేల్ నియోజకవర్గంలో ప్రొటోకాల్ సమస్య

గజ్వేల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ డివిజన్ పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఆరునెలలుగా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు డివిజన్ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. గత బతుకమ్మ పండుగ ముందు పంపిణీ చేసిన అధికారులు అప్పటి నుంచి చెక్కులను పెండింగ్‌లోనే పెట్టడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెక్కులు ఇవ్వాలంటూ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా లబ్ధిదారులు తిరుగుతున్నారు. అసలు చెక్కులు వస్తాయా.. రావా అని సందేహంలో పడ్డారు.

టైం దొరక్క..

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయాలంటే గజ్వేల్ నియోజకవర్గంలో ప్రోటోకాల్ సమస్య వచ్చిపడింది. అధికారికంగా కాంగ్రెస్‌కు ఎటువంటి నియోజకవర్గ స్థాయి ప్రోటోకాల్ లేకపోవడం, ఎమ్మెల్యే కేసీఆర్ కావడం, ఎంపీగా రఘునందన్‌రావు బీజేపీ నుంచి ఉండడంతో అధికార కాంగ్రెస్ పార్టీ చెక్కుల పంపిణీలో ఇబ్బందులు పడుతుంది. ఈ క్రమంలో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ లేదంటే ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ వారికి తగిన సమయం దొరక్కపోవడంతో చెక్కుల పంపిణీ ముందుకు సాగడం లేదు. చెక్కులు ఎవరి ద్వారా పంపిణీ చేయించాలో అర్థం కాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే చెక్కులు మంజూరై కార్యాలయంలో సిద్ధంగా ఉన్నప్పటికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న ప్రతిపక్ష నేత కేసీఆర్, మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు అపాయింట్‌మెంట్ కోసం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన దాదాపుగా 800కు పైగా చెక్కులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ విషయమై ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు చెక్కులను అందజేయాలని వారు కోరుతున్నారు.



బస్వాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రాకూడదు

- కలెక్టర్ మనుచౌదరి

కోహెడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం కోహెడ మండలం బస్వాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన పాడీ క్లీనర్లు, విద్యుత్ సౌకర్యం, గన్నీ బ్యాగ్‌లు, టార్పాలిన్లు, సంచులు ధాన్యంతో నింపి కుట్టడానికి దారాలు తప్పనిసరిగా ఉంచాలని వివరించారు. తేమ శాతం రాగానే వేగంగా లోడ్ చేసే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు తప్పనిసరిగా ఉంచేలా కేంద్రాల ఇన్‌చార్జులు చూసుకోవాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా కేంద్రాలకు వచ్చిన ధాన్యా న్ని అమ్ముకునేలా ప్రతి ఒక్క అధికారి పని చేయాలన్నా రు. కలెక్టర్ వెంట డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, ఆర్డీవో రామ్మూర్తి, సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్, తహసీల్దార్ సురేఖ, ప్రజాప్రతినిధులు, ధాన్యం కేంద్రం ఇన్‌చార్జులున్నారు.

సంకల్పానికి.. విధి చేతులెత్తింది!

- నాలుగేళ్లకే కంటి చూపు కోల్పోయినా.. పట్టుదలతో పీజీ పూర్తి
- ప్రభుత్వ లెక్చరర్‌గా ఉద్యోగం..
- ఇప్పటికే రెండు పుస్తకాల రచన 7

అన్నదాతల్లో గుబులు

వాతావరణశాఖ హెచ్చరికతో కలవరం 8



జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఏర్పాట్లు

రాములోరి కల్యాణానికి ముస్తాబవుతున్న సంగారెడ్డి రాంమందిరం

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న జరుగనున్న శ్రీ రామ నవమి వేడుకలకు సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రామ్ మందిరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధ్వర్యంలో జరుగనున్న శ్రీ రాములోరి కల్యాణానికి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఈ కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చే వందలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీ రాములోరి కల్యాణ తంతను జగ్గారెడ్డి-నిర్మలారెడ్డి దంపతులు జరిపించనున్నారు.



◄ శ్రీరామనవమి వేడుకల జగ్గారెడ్డి-నిర్మలారెడ్డి కరపత్రాలు ►

మన వల్లే ప్రకృతి విపత్తులు

- జీవవైవిధ్యం అవసరం
- ముగిసిన జాతీయ సదస్సు
- పరిశోధన పత్రాలు సమర్పించిన విద్యార్థులు 7



సురేఖమ్మా.. చూడమ్మా..!

ఓ వైపు 515 ఎకరాల్లో పరుచుకున్న పచ్చని చెట్లు.. మరోవైపు వినోదానికి, విజ్ఞానానికి, విహారానికి చిరునామాలా మారిన ఆకర్షణీయ ఏర్పాట్లు.. ఇంకోవైపు పర్యాటకులకు కనువిందు చేస్తూ గంతులేసే జింకలు.. సెల్ఫీ పాయింట్స్, కాటేజీలు, వ్యూ ల్యాండ్ మార్క్, అందమైన పిల్లబాటలు.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్న సిద్దిపేట ఆక్సిజన్ పార్కుకు గ్రహణం పట్టుకుంది. పర్యాటక కేంద్రంగా ఉన్న ఈ అర్బన్ ఫారెస్టు వైపు కన్నెత్తి చూసేవారు లేరంటే అతిశయోక్తి కాదు. అటవీశాఖ అధికారులు తమ ప్రయత్నం చేస్తున్నప్పటికీ నిధులు లేకపోవడంతో దీని నిర్వహణ భారమైంది. ఫలితంగా అందమైన పచ్చని అటవీ పార్కు కాస్తా ఎండిపోయి వెక్కిరిస్తూ దర్శనమిస్తోంది.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 4

సిద్దిపేట ఆక్సిజన్ పార్కుపై పట్టింపేది

- 515 ఎకరాల్లోని అడవికి గతంలో మహర్దశ
- ప్రస్తుతం నిధుల్లేక గాడితప్పిన నిర్వహణ
- వెక్కిరిస్తున్న విహార, వినోదాత్మక, విజ్ఞాన ఏర్పాట్లు
- జింకలు, ఇతర జంతువులకూ నీటిగోస
- పర్యాటకులను ఆకర్షించలేని అర్బన్ ఫారెస్టు
- జిల్లాకు ఇన్‌చార్జిగా ఉన్న అటవీశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టిసారిస్తేనే పునర్వైభవం



ఆక్సిజన్ పార్కులో ఎండిపోయిన చెట్లు, విరిగిన కుర్చీలు



పార్క్‌లో ఖాళీ మద్యం బాటిళ్లు

సిద్దిపేట జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని నాగుల బండ వద్ద ఉన్న 515 ఎకరాల అటవీ ప్రాంతాన్ని గత ప్రభుత్వంలో అభివృద్ధి చేశారు. నాడు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ప్రత్యేక చొరవ చూపించి హరితనిధిని ఏర్పాటు చేయించారు. ఈ అడవిని ఆక్సిజన్ పార్కుగా నామకరణం చేసి అనేక రకాల మొక్కలు నాటించారు. పిల్లలు, పెద్దలు సరదాగా గడపడానికి అవసరమైన వినోదాత్మక, విజ్ఞానపరమైన విభాగాలను ఏర్పాటు చేయించారు. ఈ చర్యలతో అనతికాలంలోనే ఆక్సిజన్ పార్కుకు గుర్తింపు దక్కింది. అటవీ భూములను సంరక్షించడంతోపాటు ప్రజలకు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించేలా తీర్చిదిద్దారు.



పనిచేయని వాటర్ ప్లాంటు

పర్యాటకుల్లేక వెలవెల

ఆక్సిజన్ పార్కును సందర్శించడానికి పర్యాటకులు ముందుకు రావడం లేదు. ఏడాది క్రితం వరకు పర్యాటకులతో ఈ పార్కు సందడిగా ఉండేది. నాడు నిత్యం 300 మందిపైచిలుకు పర్యాటకులు వచ్చేవారు. తద్వారా ఆదాయం కూడా వచ్చేది. ఈ ఆదాయంతో అటవీశాఖ సిబ్బంది పార్కు అభివృద్ధికి వెచ్చించే పరిస్థితి ఉండేది. ఆదాయంతోపాటు హరితనిధి కూడా ఉపయోగపడింది. ప్రస్తుతం నిర్వాహణ లోపంతో పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు 20 నుంచి 30 మంది కూడా మించడం లేదు. పార్కుకు ఆదాయం పూర్తిగా పడిపోయింది.

వనానికి, వన్యమృగాలకు గోస

పచ్చని చెట్లు ఎండిపోతుండడం, అడవిలోని జింకలకు కూడా తాగునీటి వసతి లేకపోవడంతో ఒక్కోసారి సంబంధిత అధికారులే తమ సొంత ఖర్చులు పెడుతున్నట్లు తెలిసింది. ఈ పార్కులో వందల కొద్దీ జింకలున్నాయి. ఇవి పచ్చికను మేస్తుంటాయి. కానీ తాగడానికి నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాయి. ఎండాకాలం రావడంతో సమస్య జఠిలమైంది. పార్కులోని వాటర్‌ప్లాంట్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. మోటార్లు రిపేర్ అయ్యి నీటివసతి కరువైంది. కళ్లముందే మొక్కలు, చెట్లు ఎండిపోతున్నా అధికారులు, సిబ్బంది ఏమీ చేయలేకపోతున్నారు. నిధుల కోసం పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్నట్లుగా సమాచారం. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న కొండా సురేఖ ఈ ఆక్సిజన్ పార్కుపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.



సోలార్ పలకల దుస్థితి

కలలను సాకారం చేసుకోండి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- మోడల్‌స్కూల్‌లో జాతిపిత విగ్రహావిష్కరణ



కోహెడ మండలం నాగ సముద్రాల మోడల్ స్కూల్‌లో విగ్రహావిష్కరణ అనంతరం ఉపాధ్యాయులు, అధికారులతో మంత్రి పొన్నం, కలెక్టర్

కోహెడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు.. ప్రతీ విద్యార్థి పెద్దపెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేలా పట్టుదలతో చదవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కోహెడ మండలం నాగసముద్రాల మోడల్‌స్కూల్‌లో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రజాస్వామికంగా అహింసా పద్ధతిలో ఉద్యమాన్ని నడిపిన జాతిపిత బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. మోడల్‌స్కూల్‌లో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను మంత్రి అభినందించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మంత్రి, కలెక్టర్ కలసి భోజనం చేశారు. వారి వెంట మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, గాంధీ జ్ఞాన్ ఫౌండేషన్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, ఎమ్మార్వో సురేఖ, ఎంపీడీవో కిష్టయ్య, ఎంఈవో పద్మయ్య అధికారులు, నాయకులు ఉన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని అందుకే గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టామని అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలో పరివేద, శ్రీరాములపల్లి, నకిరేకొమ్ముల, చెంచల్‌చెరువుపల్లె గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై సంవిధాన్ పాదయాత్ర కొనసాగింది. చంచల్‌చెరువుపల్లిలో జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నిర్మల జయరాజు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అత్తు ఇమామ్, నాయకులు బస్వరాజు శంకర్, మంద ధర్మయ్య, జగన్‌రెడ్డి సుధాకర్, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా..

హుస్నాబాద్ : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లిఖార్జున్, చిత్తారి పద్మ, చిత్తారి రవీందర్, ఎంఈవో మనీల, హెచ్ఎం వెంకటయ్య, జి.మహేందర్, లక్ష్మయ్య, రవి, మనోహర్, వనమాల, యుగేందర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ప్రతాప్, రాజయ్య తదితరులున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



సీసీపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి ప్రభాకర్

రేవంత్ పాలన ఫెయిలైంది

- హైడ్రాతో పేరుతో పేదల జీవితాలు నాశనం
- గులాబీ జెండా పుట్టిందే ఉద్యమగడ్డలో
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్



సిద్దిపేట నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేవంత్ పాలనను పసి పిల్లల నుంచి పండు ముసలి వరకు, చివరికి మూగజీవాలు కూడా క్షమించని పరిస్థితిలో ఉందని, రేవంత్‌రెడ్డి పాలన ఫెయిలైందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ నెల 27న వరంగల్‌లో జరిగే పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ ముఖ్య నాయకులతో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సభ సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలు నాశనం చేశాడని, భూముల అమ్మకాల పేరుతో మూగజీవాల గోస పోసుకుంటున్నాడన్నారు. రేవంత్‌రెడ్డికి పాలన చేయడం రావడం లేదని ఆయనను తిట్టని ఊరు లేదని, అన్ని బోగస్ మాటలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో కరోనా ఉన్నా, కష్టం ఉన్నా రైతులను ఆదుకున్నామని తెలిపారు. ప్రభు త్వ వైఫల్యం వల్ల చేర్యాల, మద్దూరు, బచ్చన్నపేట జనగాంలో 50 వేల ఎకరాలు ఎండిపోయిందన్నారు.

25 ఏళ్ల వైభవం వెల్లివిరియాలి

గులాబీ జెండా పుట్టిందే ఉద్యమగడ్డ సిద్దిపేటలోనని, సిద్దిపేటకు 25ఏళ్ల కీర్తి ఉన్నట్లు ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ జెండాను 2001లో నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఆశీర్వాదం, సిద్దిపేట ప్రజల ఆశీస్సులు తీసుకుని కేసీఆర్ ఎగురవేశారని, సిద్దిపేటకు అంత కీర్తి ఉందని చెప్పారు. ఈనెల 27న పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల సందర్భంగా ప్రతి పల్లెలో, పట్టణంలో గులాబీ జెండా ఎగరేయాలని, 25 ఏళ్ల ఆవిర్భావ వేడుకలు పండగలా వెల్లివిరియాలని పిలుపునిచ్చారు.

కాలువల అనుసంధానం పూర్తిచేయాలి

రంగనాయక, మల్లన్నసాగర్ కాలువల అనుసంధానం త్వరగా పూర్తిచేయాలని, సిద్దిపేట నియోజకవర్గంలో ఈసారి యాసంగికి తలెత్తిన సమస్యలు వచ్చే వానాకాలం పంటలకు తలెత్తకూడదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే యాసంగి పంట వరకు శాశ్వతంగా కాలువ ఏర్పాటు కావాలని అందుకు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలని, చంద్లాపూర్ లిఫ్ట్ పనులు, కస్తూరిపల్లి, గోపులాపూర్ చెక్ డ్యామ్ పనులు ప్రారంభం చేయాలని సూచించారు. పెండింగ్ పనులు పూర్తి చేసి ఘన్‌పూర్ పంప్ హౌస్ ప్రారంబానికి సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలి

సిద్దిపేట కలెక్టరేట్: కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరితో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని చిన్నకోడూరులో పొద్దుతిరుగుడు సాగుచేసిన రైతులు ఆందోళనలో ఉన్నారని, కొనుగోలు కేంద్రాలు కొనసాగించేలా చొరవ చూపాలని కలెక్టర్‌ను కోరారు.నియోజకవర్గంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూసేకరణలో జాప్యం జరుగుతుందని పెండింగ్‌లో ఉన్న కాలువల భూసేకరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని కలెక్టర్‌ను కోరారు.

కాలిన గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కొండపాక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కాలిన గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన సంఘటన కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రుక్కి సాయిలు(72)కు కొద్ది నెలల క్రితం పక్షవాతం బారిన పడడంతో చికిత్స పొందుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. మార్చి 16న ఇంట్లో ఎవరు లేని సమయంలో సాయిలు బీడీ తాగుతుండగా ప్రమాదవశాత్తు చెద్దరుకు మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుమారుడు రుక్కి బాల నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు త్రిటౌన్ పోలీసులు తెలిపారు.

వడ్ల కుప్పను ఢీకొని వ్యక్తి మృతి


రెహమాన్ (ఫైల్)

నిజాంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వడ్ల కుప్పను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం నిజాంపేట మండలంలో జరిగింది. మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ రెహమాన్(50) గురువారం అర్ధరాత్రి చేగుంట మండలం పులిమామిడికి బయలుదేరాడు. గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న వడ్లకు కుప్పలను ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

హవేళిఘణపూర్, ఏప్రిల్ 4 : భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హవేళిఘపూర్ గ్రామానికి చెందిన తాటి నరేశ్(27)కు గురువారం రాత్రి భార్యతో గొడవ జరిగింది. దీంతో ఆవేశంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు బద్దలు కొట్టగా.. నరేశ్ ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అతడిని కిందకు దింపి మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందని వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై పమియోద్దీన్ తెలిపారు. మృతుడికి భార్య నాగరాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఒకరిని రక్షించబోయి మరొకరు..

● చెరువులో మునిగి ఇద్దరు గల్లంతు

హత్నూర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చెరువులో మునిగి ఇద్దరి యువకులు గల్లంతైన సంఘటన హత్నూర మండల పరిధిలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కొండాపూర్ మండలం షాహీపేట గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ తన అత్తగారి ఊరైన హత్నూర మండలం బోర్పట్లలో జరుగుతున్న మల్లికార్జున స్వామి ఉత్సవాలకు భార్య పిల్లలతో కలిసి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం స్నానానికని ప్రేమ్‌కుమార్ గ్రామ సమీపంలోని భీముడిని చెరువులోకి దిగి ఎంతసేపటికి పైకి రాలేదు. దీంతో బోర్పట్ల గ్రామానికి చెందిన డప్పు నవీన్‌కుమార్, మరికొందరు చెరువు వద్దకు చేరుకొని నీటిలోకి దిగి గాలిస్తుండగా నవీన్‌కుమార్ కూడా గల్లంతయ్యాడు. దీంతో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఎస్ఐ సుభాష్, ఆర్ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రెస్క్యూ టీంలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా వారి ఆచూకీ లభించలేదు. చెరువు వద్ద గల్లంతయిన వారి కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

అక్రమ బియ్యం తరలింపు కేసులో

ఐదుగురు అరెస్టు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని కేంద్ర గిడ్డంగుల సంస్థ(సీడబ్ల్యూసీ) గోదాము నుంచి అక్రమంగా బియ్యం తరలింపు కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. గత నెల 31న సీడబ్ల్యూసీ గోడౌన్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 35 క్వింటాళ్ల ఎఫ్‌సీఐ బియ్యాన్ని డీసీఎంలో తరలిస్తుండగా.. స్థానికుల సాయంతో పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం సీడబ్ల్యూసీ మేనేజర్ కోటేశ్వర్ రావు, ఎగ్జిక్యూటివ్ సునీల్, టెక్నికల్ శ్యామ్‌లతోపాటు డ్రైవర్ భానుచందర్, వ్యాపారి సంతోష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరాన్ని అంగీకరించారు. దాంతో సీడబ్ల్యూసీ ఉద్యోగులతోపాటు మరో ఇద్దరి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మేనేజర్ సస్పెండ్!

మెదక్ సీడబ్ల్యూసీలో మేనేజర్‌గా పని చేస్తున్న కోటేశ్వర్‌రావును సంస్థ సస్పెండ్ చేసి, ఆయన స్థానంలో మచిలీపట్నంలో విధులు నిర్వహిస్తున్న భాగ్యరాజ్‌ను నియమించగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తికి గాయాలు

శివ్వంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తో వ్యక్తికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన ప్రకాష్ ఆరు నెలల క్రితం శివ్వంపేటలో షాపు అద్దెకు తీసుకొని ప్లైవుడ్ షాపు పెట్టగా శుక్రవారం షాపు ఖాళీ చేశాడు. పైన ఉన్న విద్యుత్ వైర్లను గమనించకుండా పైపులు ఆటోలో వేస్తుండగా అవి విద్యుత్ వైర్లకు తగిలి కాలు చెయ్యికి గాయాలయ్యాయి. వెంటనే బంధువులు అతడిని ఆస్పత్రికి తరలించారు.

సహజీవనానికి నిరాకరించిందని హత్య

జహీరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వారు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నారు. అతని పద్ధతి నచ్చకపోవడంతో ఆమె దూరం పెట్టింది. దీంతో కోపం పెంచుకున్న అతను ఆమెను గ్యాస్ సిలిండర్ తలపై మోది హత్య చేశాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని పస్తాపూర్‌లో మార్చి 30న జరిగిన మేతరి లక్ష్మి(45) హత్య కేసును పోలీసులు చేధించారు. ఆమెతో సహజీవనం చేసిన వ్యక్తే చంపిసేనట్లు తేల్చారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. కోహీర్ మండలంలోని గొటిగార్‌పల్లికి చెందిన సత్యారం రమేష్ అలియాస్ రవి, ఝరాసంగం మండలంలోని చీలమామిడి గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మి పస్తాపూర్‌లో ఉంటూ సహజీవనం చేసేవారు. రవి ప్రవర్తన నచ్చక ఆమె అతడిని దూరం పెట్టింది. దీంతో కోపం పెంచుకున్న రవి మార్చి 29న జహీరాబాద్‌లోని కల్లు కంపౌండ్ వద్ద హత్య చేయడానికి ప్రయత్నించగా, కొందరు అడ్డు పడటంతో కుదరలేదు. దీంతో మార్చి 31న ఆమె ఇంటికి వచ్చాడు. అప్పటికే అతనిపై ఆగ్రహంతో ఉన్న ఆమె రవితో గొడవ పడింది. అతని కంట్లో కారంపొడి చల్లింది. ఈ క్రమంలో నిందితుడు పక్కనే ఉన్న 5 కిలోల గ్యాస్ సిలిండర్ తీసుకుని లక్ష్మి తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ శివలింగం, ఎస్సై కాశీనాథ్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం

● వార్డెన్ నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

వట్‌పల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వట్‌పల్లి ఏఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. రేగోడు మండలం పెద్దతండాకు చెందిన కుమార్ వట్‌పల్లి మండలం దేవనూర్‌లోని ఎస్సీ హాస్టల్లో ఉంటూ అదే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గత నెల 20 వరకు పాఠశాలకు వచ్చిన విద్యార్థి 21వ తేదీ నుంచి రావడం లేదు. ఉగాది పండుగ సెలవులకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వార్డెన్‌కు ఫోన్ చేసి అడగగా, అందరు విద్యార్థులతో పాటు కుమార్ ఇంటికి బయలుదేరాడని వార్డెన్ రాజిరెడ్డి సమాధానమిచ్చాడు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వారు శుక్రవారం హాస్టల్‌కు చేరుకుని, వార్డెన్‌ను నిలదీశారు. తాను కూడా వెతుకుతున్నానని, ఆచూకీ లభించకపోతే తన తప్పేమిటని వార్డెన్ నిర్లక్ష్యంగా తల్లిదండ్రులకు మాట్లాడాడు. దీంతో ఆగ్రహానికి గురైన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్ఐ తెలిపారు. జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ హాస్టల్‌కు చేరుకుని వార్డెన్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం

● క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డీసీఎం డ్రైవర్


గాయపడిన డీసీఎం డ్రైవర్

తూప్రాన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో కాఫీడే సమీపంలో 44వ జాతీయ రహదారిపై తూప్రాన్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళుతున్న డీసీఎం వాహనం ముందుగా వెళుతున్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన కబ్రెజ్(36) తీవ్రంగా గాయపడ్డాడు. డీసీఎం వాహన క్యాబిన్‌లో ఇరుక్కుపోగా అటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు అతికష్టమీద బయటకు తీశారు. కాలుపూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మన వల్లే ప్రకృతి విపత్తులు

జీవవైవిధ్యం అవసరం.. ముగిసిన జాతీయ సదస్సు పరిశోధనా పత్రాలు సమర్పించిన విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని చేజేతులా నాశనం చేస్తున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మనం వాడే పెయిన్‌కిల్లర్ ట్యాబెట్ వల్ల రాబందుల జాతి అంతమైపోయే దశకు చేరిందని ఒకరు.. మానవ తప్పిదాల వల్లే ప్రకృతి విపత్తులు తెలుత్తున్నాయని మరొకరు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని, అరుదైన పక్షులను, జంతుజాలాన్ని కాపాడుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ మేరకు వారు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ (ఐసిఎస్ఎస్ఆర్) ఆర్థిక సహకారంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఐ.క్యూఏసీ, రాజనీతిశాస్త్ర విభాగం, జువాలజీ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. 'వికసిత్ భారత్-2047 లక్ష్యాలు, పర్యావరణ సమగ్ర అభివృద్ధి' అంశంపై సదస్సు రెండురోజుల పాటు చర్చ కొనసాగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశోధక విద్యార్థులు పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే 9వ తరగతి విద్యార్థిని శ్రేష్ఠ పర్యావరణం గురించి ప్రజెంట్ చేసిన పోస్టర్ ఆకట్టుకుంది. శుక్రవారం జరిగిన ముగింపు సమావేశంలో వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ స్టేట్ డైరెక్టర్ పరిధా తంపాల, హైదరాబాద్(ఎన్ఆర్ఎస్ఈ) నేషనల్ రిమోట్ సెన్సింగ్ సీనియర్ సైంటిస్ట్ డా.సి. సుధాకర్‌రెడ్డి, అన్నామలై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టి రామనాథన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత మాట్లాడారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్లు డా. ఎన్ హరిబాబు, పి. అయోధ్య రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సిహెచ్ మధుసూదన్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్త



జాతీయ సదస్సు సందర్భంగా రూపొందించిన వాల్ పోస్టర్

మానవ తప్పిదాల వల్లనే..



నేను ఎంఎస్సీ ఎన్విరామెంటల్ సైన్స్ చేస్తున్నాను. ఎవల్యూటింగ్ ద ఫ్రాగ్మంటేషన్ ఆండ్ కనెక్టివిటీ ఆఫ్ మ్యాంగ్రో ఈకో సిస్టమ్ అండమాన్, నికోబార్ ఐలాండ్స్ అనే అంశంపై పరిశోధన రీసెర్చ్ పేపర్ ప్రజెంట్ చేశాను. ప్రకృతి విపత్తులను తట్టుకోవడానికి సహజంగా నేచర్ ఒక సిస్టమ్ ఉంటుంది. ఆ సిస్టంను మానవ తప్పిదాల వల్ల నాశనం చేసినప్పుడు ప్రకృతి చేసే విళయతాండవానికి ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. అలాంటివే మ్యాన్‌గ్రూస్ ఫారెస్ట్‌లు. ఇవి ఎక్కువగా సముద్ర తీర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడతాయి. వీటి వల్ల ప్రకృతి విపత్తులైన సునామీ వంటిని అడ్డుకోవచ్చు. మేం అండమాన్ ప్రాంతంలోని మ్యాన్‌గ్రూస్‌పై రీసెర్చ్ చేసినప్పుడు 616 స్క్వేర్ కిలోమీటర్ల మేర ఈ మ్యాన్‌గ్రూస్ వ్యాపించి ఉండేవని, 2023లో సునామి వచ్చినప్పుడు ఒక వంద స్క్వేర్ కిలోమీటర్ల పరిధి దెబ్బతిన్నట్లు రిమోట్ సెన్సింగ్ ద్వారా తెలుసుకున్నాం. వీటి పట్ల నిర్లక్ష్యం వహిస్తే మరో 100 స్క్వేర్ కిలోమీటర్ల పరిధి కోల్పోయే ప్రమాదముంది. మానవ తప్పిదాల వల్ల మ్యాన్‌గ్రూస్ ఫారెస్ట్‌లను తొలగించినట్లయితే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వీటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలి.

విజయ లక్ష్మి, భారతీదాసన్ యూనివర్సిటీ, తిరుచ్చి, తమిళనాడు

అరుదైన పక్షి జాతులు అంతరించిపోతున్నాయి



నేను కేరళ డిజిటల్ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ ఎకాలజీ చదువుతున్నాను. ఇక్కడ జరుగుతున్న నేషనల్ సెమినార్‌లో ప్రిడిక్టింగ్ కీ హబిటాట్స్ ఫర్ కన్వజరేషన్ అండ్ ఎండోమిక్ త్రెట్టన్ బర్డ్స్ స్పెసిస్ అనే అంశంపై పరిశోధనపత్రం సమర్పించాను. ప్రస్తుతం సమాజంలో చాలా వరకు జాతులు అంతరించిపోతున్నాయి. అలాంటి వాటిలో వల్చర్ (భారత రాబందు), సన్‌బర్డ్ అనే పక్షి జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. పశ్చిమ కనుమలలో ఎక్కువగా కనిపించే ఈ రెండు జాతులు గుజరాత్, కేరళలో ఎక్కువగా ఉంటాయి. రానూ రానూ ఈ రెండు జాతులు అంతరించే పోయే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే 90 శాతం పక్షులు కనుమరుగయ్యాయని మా పరిశోధనలో తెలింది. ఈ పక్షుల వల్ల ప్రకృతికి ఎలాంటి హనీ లేకపోగా మంచి జరుగుతుంది. చనిపోయిన మనుషుల, జంతువుల కళేబరాలు తినే రాబందు అంతరించడానికి ప్రధాన కారణం మనం తరుచుగా వాడే డైక్లోఫేనిక్ అనే టాబ్లెట్, ఇంజక్షన్ వల్ల చనిపోతున్నాయని తెలిస్తే ఆశ్యర్యం కలుగుతుంది. కానీ వాస్తవం. సాధరణంగా డైక్లోఫేనిక్‌ను పెయిన్‌కిల్లర్‌గా వాడుతారు. అలా వాడిన కళేబరాలను తినటం వలన రాబందులు చనిపోతున్నాయని రీసెర్చ్ వల్ల తెలుసుకోగలిగాం. ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోతే ఈ రెండు జాతులను భవిష్యత్‌లో చూడలేమనేది వాస్తవం. పెయిన్ కిల్లర్ల వాడకం గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- గోనుగుంట్ల ప్రణతి, అనంతపూర్, ఆంధ్రప్రదేశ్

నేల నిస్సారం చేసే లాంటినా కెమెరా



ఐడెంటిఫైయింగ్ ఇన్విషన్ హట్‌స్పాట్స్ ఆఫ్ లాంటినా కెమెరా ఇన్ ప్రొడెక్టెడ్ ఎరియాస్ ఆఫ్ వెస్టర్న్ గార్డ్స్ అనే అంశంపై రీసెర్చ్ పేపర్ ప్రజెంట్ చేశాను. చాలా రకాల మొక్కలు నేలకు మంచి చేస్తాయి. కానీ, కొన్ని మాత్రం భూసారాన్ని తగ్గించి హనీ చేస్తాయి. అలాంటి మొక్కనే లాంటినా కెమెరా (తలంబ్రాల చెట్టు) ఈ చెట్టు అమెరికా దేశానికి చెందిన మొక్క. కానీ ఇది దేశంలో చాలా చోట్ల విరివిగా పెరుగుతుంది. అయితే దీనివల్ల నేలకు హనీ కలుగుతుందని పరిశోధనలో వెల్లడైంది. ఈ మొక్క పెరిగిన చోట వేరే ఇతర మొక్కలు పెరిగే అవకాశం ఉండదు. వేర్లు భూమిలోకి పాతుకుపోయి నేలలోని సారాన్ని పీల్చివేస్తాయి. ఇలాంటి సమస్యలను మొదటనే అరికట్టగలిగితే భూసారాన్ని కాపాడుకున్నవాళ్లమవుతాం. లేదంటే చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ చెట్లను కొట్టివేయకుండా వేర్ల నుంచి తీసివేస్తేనే మళ్లీ పెరగకుండా ఉంటాయి.

-అమిత్తు జేఎస్, త్రివేండ్రం, కేరళ

ఉపయోగకరమైన బ్యాక్టీరియాతో ఆక్వా కల్చర్



నేను సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో చదివాను. ప్రస్తుతం అన్నామలై యూనివర్సిటీలో జినోమిక్ ల్యాబ్‌లో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నాను. ఈ సెమినార్‌లో ద డ్యూయల్ రోల్ ఆఫ్ వైబ్రియన్ స్పెసెస్ ఇన్ ఆక్వాకల్చర్ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించాను. ఆక్వా కల్చర్‌లో సాధరణంగా రైతులు ఫర్టిలైజర్స్, యాంటి బయాటిక్స్ ఎక్కువగా వాడుతుంటారు. వాటి వాడకం వలన చాలా ఇబ్బందులు వస్తాయి. వైబ్రియన్ అనే బ్యాక్టీరియాలోని ఉపయోగకరమైన దాన్ని ఆక్వా కల్చర్‌లో ఉపయోగించటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. ఇందుకోసం ఆంధ్రాలోని భీమవరం, తమిళనాడులోని నాగపట్నంలో పరిశోధనలు కొనసాగించాం.

జి. ధనుష్, అన్నామలై యూనివర్సిటీ, తమిళనాడు

రాములోరికి వెండికిరీటాలు

బహూకరించిన అజ్ఞాత భక్తులు



అజ్ఞాత భక్తులు అందజేసిన కిరీటాలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చారిత్రాత్మకమైన రామాలయంలోని రామ, లక్ష్మణ, భరతుడితోపాటు హన్మంతుడికి అజ్ఞాత భక్తులు శుక్రవారం వెండి కిరిటాలను బహూకరించారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన కొందరు ఆలయ ప్రతినిధులకు వెండి కిరీటాలు అందించారు. అయితే, తమ పేర్లు బయటపెట్టవద్దని కోరారు. దీంతో ఆలయ కమిటీ వారు అజ్ఞాత భక్తులను అభినందించారు.

సీతారాముల కల్యాణానికి ముస్లింలకు ఆహ్వానం



పోలీసుల సమక్షంలో కల్యాణ ఆహ్వానపత్రిక అందజేస్తున్న ప్రతినిధులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగే సీతారాముల కల్యాణానికి హాజరుకావాలని నిర్వాహకులు ముస్లింలకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఇందుకు కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ వేదికగా మారింది. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ లతీఫ్ మాట్లాడుతూ మతం పేరుతో విబేధాలు వద్దని, అన్ని మతాలు సమానమేనని, పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. హిందూ ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలో అంతా కలిసి మెలిసి ఉంటామని, తమ మధ్య విబేధాలు లేవని అన్నారు. ఈ క్రమంలో శ్రీరామ కల్యాణనిర్వాహకులు స్వామి వారి కల్యాణానికి రావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భాషాసంస్కృతుల పరిరక్షణకు కృషి చేసిన యశోదారెడ్డి

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాహిత్యంలో తెలంగాణ భాషాసంస్కృతుల పరిరక్షణ కోసం కృషిచేసిన వారిలో యశోదారెడ్డి ముందువరుసలో ఉంటారని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజిరెడ్డి మహేందర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఆచార్య యశోదారెడ్డి కథాసాహిత్యంపై శుక్రవారం విస్తృతోపన్యాస కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డా. మట్టా సంపత్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత, తెలుగుశాఖ అధ్యాపకులు పిట్ల దాసు, నారోజు వెంకటరమణ, నరేశ్, శైలజ, సంపత్ కుమార్, రామస్వామి, నర్సింహులు, సాయిసురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

జేఎన్టీయూను సందర్శించిన వీసీ

పుల్‌కల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను వీసీ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని వివిధ భాగాలలో కలియ తిరుగుతూ సౌకర్యాలను ప్రిన్సిపాల్ నరసింహను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం తదితర వాటి గురించి ఆరా తీశారు. సువిశాల విస్తీర్ణంలో వసతి గృహ సముదాయాలు, తరగతి గదుల సముదాయాలు బాగున్నాయంటూ సంతృప్తిని వ్యక్తం చేశారు. విశాలమైన రహదారులు, ఆధునాతన విధానంతో కళాశాలను తీర్చిదిద్దిన తీరును ఆయన ప్రశంసించారు. అనంతరం అధ్యాపకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జేఎన్టీయూకు మంచి పేరు ఉందని, ఆ బ్రాండ్‌కు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఆధారపడి ఉందన్నారు. పరిపాలన భవనంలో ప్రతిష్ఠించిన శ్రీ సరస్వతీ మాతను ఆయన దర్శించుకున్నారు. ముందుగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డికి ప్రిన్సిపాల్ జి.నరసింహ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



జేఎన్టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డికి భూమి పత్రాలను అందజేస్తున్న ఆర్డీవో పాండు

ఫార్మసీ కళాశాలకు 15 ఎకరాలు

అందోలు శివారు సర్వే నంబర్ 1,141లో గల 15 ఎకరాల భూమి పత్రాలను ఆర్డీవో పాండు జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం అందజేశారు. మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రత్యేక చొరవతో ఫార్మసీ కళాశాలను మంజూరు చేశారు. ఈ కళాశాల నిర్మాణానికి అవసరమైన అందోలు శివారులోని సర్వే నంబర్ 1,141లో 15 ఎకరాల భూమిని కేటాయించారు. గడిచిన మూడేళ్లుగా ఫార్మసీ కళాశాల జేఎన్టీయూ కళాశాలలో కొనసాగుతున్నది. ఫార్మసీ కళాశాలకు కేటాయించిన భూమిని జేఎన్టీయూ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ జి.నరసింహ, సునీతారెడ్డిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పిడుగు పడి చీలిన చెట్టు

శివ్వంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు రైతు పంట పొలంలో చెట్టు చీలిపోయిన సంఘటన మండలంలోని దొంతి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని దొంతి గ్రామంలో గురువారం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఇదే సమయంలో గ్రామానికి చెందిన లింగారెడ్డి పొలం దగ్గర వేప చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు చీలిపోయింది. ఆ సమయంలో పొలం దగ్గర ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఐఐటీ-హెచ్ సహకారంతో చెత్త సమస్యకు చెక్



డంపుయార్డును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

కంది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కందిలో ఎన్నాళ్ల నుంచో వేధిస్తున్న చెత్త సమస్యకు ఐఐటీ-హెచ్ సహకారంతో చెక్ పడనుందని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. మండలకేంద్రమైన కందిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలోని చెత్త డంపును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కార్యాలయ ఉద్యోగులకు, మైనారిటీ పాఠశాల విద్యార్థులకు, డబుల్ బెడ్‌రూంలలో నివాసం ఉంటున్న వారికి దుర్వాసన రాకుండా, ఎలాంటి ఇబ్బంది కలగకుండా చెత్త డంపును శుభ్రం చేయాలని ఆదేశించారు. సెగ్రికేషన్ షెడ్ వద్ద తడి-పొడి చెత్తను సరిగా వేరు చేయడంలేదని మండిపడ్డారు. తడి-పొడి చెత్తను వేరు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే తడి-పొడి చెత్త సేకరణ కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. కందిలో చెత్త రీసైక్లింగ్ ప్లాంటుకు ఏర్పాటుకు ఐఐటీహెచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందుకోసం వెంటనే ఒక ఎకరం స్థలం కేటాయించడానికి సన్నాహాలు చేస్తున్నామని సాయిబాబా పేర్కొన్నారు. భూమి సేకరణ పూర్తయిన వెంటనే చెత్త రీసైక్లింగ్ ప్లాంటును ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో అనిత, ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి విద్యాధర్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీకాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపన

హాజరైన పీఠాధిపతులు



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో పీఠాధిపతులు

రాయికోడ్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధర్మాపూర్‌లో వెలసిన శ్రీలలిత కోటి పార్థీవ లింగస్థాన దేవస్థానంలో శ్రీకాలభైరవ ధ్వజ స్థంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర మహారాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పంచవటి కాశీనాథ్, బసవలింగ అవదూత గిరి మహారాజ్, వీరేశ్వర శివాచార్య మహాస్వామిజీ, హిందూ ఆశ్రమ పీఠాధిపతి చిన్న మల్లికార్జునస్వామి, రాచయ్యస్వామి తదితరులు హాజరయ్యారు. దేవాలయంలో గణపతిపూజ, గోపూజ, రుద్రాభిషేకం, అనంతరం వేద బ్రా హ్మణులు ఉదయం శ్రీ కాలభైరవ, ధ్వజస్తంభం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీఠాధిపతులు మాట్లాడుతూ దేశంలో విభిన్న సంస్కృతుల నిలయమని, అన్ని మతాలు, కులాలు, వర్గాల సమష్టి కలయిక అని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. భగవత్ నామస్మరణతోనే మనిషికి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు, గురువులు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపకులు ఎస్‌కే పాటిల్, దేవాలయ కమిటీ అధ్యక్షులు నేతి జ్ఞానేశ్వర్, తాజామాజీ జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్ వీరభద్రేశ్వర్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.


సంకల్పానికి.. విధి చేతులెత్తింది!

నాలుగేళ్లకే కంటి చూపు కోల్పోయినా..

పట్టుదలతో పీజీ పూర్తి

ప్రభుత్వ లెక్చరర్‌గా ఉద్యోగం..

ఇప్పటికే రెండు పుస్తకాల రచన




జీవనప్రవంతి ఆవిష్కరణలో నందిని సిద్ధారెడ్డి, నాళేశ్వరం శంకర్ తదితరులు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పుట్టిన నాలుగేళ్లకు కళ్ల కలక వస్తే.. పసరు మందు వేశారు. దీంతో రెండు కళ్లూ కనిపించకుండా పోయాయి. 'కళ్లు కనిపించవు.. ఇక వాడు ఏం చేయగలుగుతాడు' అంటూ చుట్టుపక్కల వారు ఎగతాళి చేశారు. సూటిపోటి మాటలు అనే వారు. అవే ఆయనలో కసిని పెంచాయి. జీవితంలో విజయం సాధించడమే వారికి తానిచ్చే సమాధానం అనుకున్నారు ఆయన. చదువుకుని మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించి ఔరా అనిపించారు. అంతటితో ఆగకుండా రచనావ్యాసంగాన్ని చేపట్టి పుస్తకాలు రాశారు విశ్రాంత అధ్యాపకులు గోపాల్. ఇప్పటికే రెండు పుస్తకాలు రాసిన ఆయన 70 ఏళ్ల వయస్సులో మరో పుస్తక రచనకు పూనుకున్నారు.

చూపులేదనే కలత చెందకుండా..

ప్రస్తుత కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం, పోచారం గ్రామంలో పుట్టిన గోపాల్‌కు నాలుగేళ్ల వయస్సులో కండ్ల కలక రావడంతో పసరు మందు వాడారు. దీంతో ఆయన రెండు కళ్ల కనిపించకుండా పోయాయి. అయితే, చూపులేదనే కలత చెందకుండా చదువుకుంటానని ఇంట్లో వాళ్లకు చెప్పారు. వారు హైదరాబాద్ మలక్‌పేటలోని అంధుల పాఠశాలలో చేర్పించారు. కొన్నాళ్లకే తండ్రి కాలం చేశారు. అయినా, అక్కడే ఉండి ఉస్మానియా వర్సిటీ నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేశారు. 1978లో వనపర్తి ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. కొన్నాళ్ళ తర్వాత బదిలీపై సిద్ధిపేట ప్రభుత్వ కళాశాలలో పనిచేశారు. తర్వాత మెదక్ బాలుర జూనియర్ కళాశాలలో కొన్నాళ్ల పని చేసిన అనంతరం పదోన్నతిపై సిద్దిపేట డిగ్రీ కళాశాలకు వెళ్లారు. అక్కడినుండే ఉద్యోగ విరమణ చేసారు.



గోపాల్ రచించిన పుస్తకం

సాహిత్యంపై ప్రేమ

సాహిత్యంపై ప్రేమతో తెలంగాణ రచయితల సంఘం సభ్యుల్లో ఒకరుగా నిలిచారు గోపాల్. నందిని సిద్దారెడ్డితో కలిసి చదువుకున్నారు. జీవన ప్రవంతి అనే పుస్తకాన్ని రెండు భాగాలుగా రచించారు. సిద్ధారెడ్డి సలహాలతోనే ఈ రెండు పుస్తకాలు రచించినట్టు గోపాల్ అంటారు. జీవన ప్రవంతి మొదటి భాగాన్ని సిద్దిపేటలో పోచారం గ్రామంలో ఆవిష్కరించారు. రెండో భాగం ఇటీవలే మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా ఆవిష్కరించారు.

కళ్లు లేకున్నా.. నిరుత్సాహ పడలేదు



కళ్లు కనపించకున్నా.. ఏనాడూ నిరుత్సాహ పడలేదు. అంగవైకల్యం అనేది లక్ష్యాన్ని ఏమాత్రం ప్రభావం చేయలేదు. నాలుగేళ్ల వయస్సులోనే కళ్లు కనిపించకుండా పోయినా చదువు పై దృష్టి సారించాను. ఈ ప్రయాణంలో నా కుటుంబ సభ్యులు, మిత్రుడు నందిని సిద్దారెడ్డి ఎంతో తోడ్పాటును అందించారు. ఇప్పటికే ఇతరుల సహాయంతో నా భావాలతో రెండు పుస్తకాలు రచించాను. ఇంకొక పుస్తక రచనకు పూనుకున్నాను.

గోపాల్, విశ్రాంత డిగ్రీ కళాశాల లెక్చరర్



పూల సోయగం

ఆకాశం లేత నీలం రంగులో మెరిసిపోతుండగా.. అక్కడక్కడ తెల్లటి మేఘాలు తేలియాడుతుండగా.. ఓ చెట్టుకు పూసిన లేత గులాబీ రంగు పూలు మనోహరంగా కనిపిస్తున్నాయి. ఈ చెట్టు నిండా పూసిన ఆ అందమైన పుష్పాలు రాలి నేలంతా పరుచుకున్నాయి. ఈ రమణీయ దృశ్యం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలోనిది. ఈ చెట్టు ఆ ప్రాంతానికి ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చింది. అటువైపు నుంచే వెళ్లేవారిని ఆకర్షిస్తోంది. చాలా మంది దీని ముందు నిలబడి ఫొటోలు దిగుతూ ఆనందిస్తున్నారు.

- నంగునూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి)



మేం కోతకు వచ్చాం

మేము కోతకు వచ్చామంటూ పసిడి రంగుతో పచ్చని పైరు కనువిందు చేస్తుంది. కొండపాక మండలం బందారం గ్రామంలో వరి చేలు పసిడి రంగుతో మెరిసిపోతున్నాయి.

- కొండపాక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి)

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కత్తుల భాస్కర్‌రెడ్డి



భాస్కర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కత్తుల భాస్కర్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడతానన్నారు.

అగ్నివీర్, నేవీకి ఉచిత శిక్షణ

గజ్వేల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఆర్మీ, నేవీ ద్వారా వెలువడిన అగ్నివీర్ నోటిఫికేషన్ ఈనెల 10తో ముగుస్తుందని ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నీల చంద్రం తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని డిఫెన్స్ అకాడమీలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తి గల 18 నుంచి 21 ఏళ్ల లోపు వారు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఆజాద్ డిఫెన్స్ అకాడమీలో ఉచితంగా శిక్షణ అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9392691069, 9948643620 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పట్టణంలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన తనిఖీలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మందిని పట్టుకొన్నారు. వారిని శుక్రవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచారు. ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను, మిగతా వారికి రూ.31,000 జరిమానా విధించారు.

దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీరాములు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారు సంబంధిత పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో అందజేయాలని సూచించారు. ఈనెల 14 వరకు దరఖాస్తు గడువును పొడగించారని, ఆసక్తి ఉన్న నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తహసీల్దార్‌కు ప్రధాని మోదీ చిత్రపటం అందజేత

కుకునూరుపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సుజాతను శుక్రవారం బీజేపీ కుకునూరుపల్లి అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటాన్ని ఆమెకు అందజేశారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

చేర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మహనీయులు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించుకుందామని మాలమహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాంవెంకటేశ్ కోరారు. శుక్రవారం చేర్యాలలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహనీయుల త్యాగాలు భావితరాలకు తెలియజేసేందుకు పాటుపడాలని కోరారు. ఏప్రిల్ మాసాన్ని మహనీయుల జయంతుల మాసంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.

హుస్నాబాద్ కన్వీనర్‌గా సాయన్న

హుస్నాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ నెలలో నిర్వహించే పలువురు మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించేందుకు శుక్రవారం హుస్నాబాద్‌లో జయంతి ఉత్సవాల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ కన్వీనర్‌గా లింగాల సాయన్న, కో కన్వీనర్లుగా కొమ్ముల భాస్కర్, పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, పలువురిని, కో ఆర్డినేటర్‌గా ముక్కెర సంపత్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శులుగా గడిపె బాలయ్య, గడిపె చిన్న బాలు, కనకం వెంకట్, సలహాదారులుగా కేడం లింగమూర్తి, గాదెపాక రవీందర్‌ను ఎన్నుకున్నారు.

చేతి పంపుల మరమ్మతు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించేందుకు చేతి పంపుల మరమ్మతులు చేపడుతున్నారు. శుక్రవారం మండలంలోని గాంధీనగర్ గ్రామంలో చేతి పంపులు పనిచేయక పోవడం వల్ల నీటి ఎద్దడి ఏర్పడిందని కిషన్‌గర్ కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పంచాయతీ కార్యదర్శి పంపు మెకానిక్ కొమురయ్యను పంపించి వాటిని బాగు చేయించి కాలనీ వాసులకు తాగునీటి ఇబ్బందిని తీర్చినట్లు పంపు మెకానిక్ తాళ్లపల్లి కొంరయ్య తెలిపారు.

అన్నదాతల్లో గుబులు

వాతావరణ శాఖ హెచ్చరికతో కలవరం

దౌల్తాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటలు చేతికొచ్చే దశలో వర్ష సూచనలున్నాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలకు గుబులు పట్టుకున్నది. వడగండ్లు, ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తాయనడంతో కలవరం మొదలైంది. దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి, దొమ్మాట, సూరంపల్లి, దౌల్తాబాద్, గొడుగుపల్లి, ఇందుప్రియాల్ తదితర గ్రామాల్లో వరితో పాటు మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మిరప, టమాట పంటలు చేతికొచ్చి దశలో ఉన్నాయి. ఇప్పుడు వడగండ్ల వాన కురిస్తే పంటలు నేలపాలు అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు మొక్కజొన్న చేతికందడంతో కల్లాల్లో ఆరబెట్టగా గురువారం కురిసిన అకాల వర్షానికి తడిసిపోయాయి. ఇటీవలే కురిసిన అకాల వర్షానికి కొన్నిచోట్ల మొక్కజొన్న పంట పాలు పోసుకునే సమయంలో నేలవాలడంతో రైతులకు నష్టం తప్పలేదు. మరికొన్ని చోట్ల వరిపైరు నేలవాలి వడ్లు రాలిపోయాయి. మరో రెండు రోజులు వర్ష సూచనలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులకు దిక్కుతోచడం లేదు.



దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో ఆరబెట్టిన మక్కలపై కవర్ల కప్పుతున్న రైతు

పంటలను పరిశీలించిన ఏడీ

గజ్వేల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలంలో వడగండ్ల వానతో పాడైన పంటలను వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్, మండల వ్యవసాయాధికారి గుండు నాగరాజు పరిశీలించారు. ధర్మారెడ్డిపల్లి, సంగుపల్లి, కొమటిబండ, జాలిగామ, గజ్వేల్ గ్రామాల శివారులోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టాన్ని అంచనా వేశారు. సుమారుగా 54 ఎకరాల్లో మొక్కజొన్న పంట, 126 ఎకరాల్లో వరి పంట వడగండ్ల వానకు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏడీ బాబునాయక్ తెలిపారు.

'అమ్మ కమిటీ'ల ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులను కల్పించడంతో సుందరంగా తయారయ్యాయని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక మండలం దుద్దెడ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ పిల్లలకు ఆహ్లాద వాతావరణంలో ఆటపాటలతో చదువు అందిస్తే వారిలోని సృజనాత్మకత అంతర్గత అంశాలు బయటకు వస్తాయన్నారు. దుద్దెడ పాఠశాలను కలెక్టర్ దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పురమాండ్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలయ్య ఉపాధ్యాయ సంఘం నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



దుద్దెడ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, బెజ్జంకి ఆదర్శ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

నంగునూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ధర్మాన్ని అంకితభావంతో నిర్వహిస్తే విద్యార్థుల హృదయాల్లో నిలిచిపోతారని డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నంగునూరు హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు రొడ్డ సత్యనారాయణరెడ్డి ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం గొట్టిపర్తి రామస్వామిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఎంఈవో దేశిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విద్యాసాగర్, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

బెజ్జంకి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టంతో చదవాలని ఎంఈవో మహతిలక్ష్మీ అన్నారు. శుక్రవారం ఎల్లంపల్లి గ్రామంలోని ఆదర్శ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, సెక్టోరల్ ఆఫీసర్ రంగనాథ్, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం

మద్దూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం లద్నూరు, రేబర్తి గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వరదరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెదలాలని సూచించారు. ప్రణాళికతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాలలో పాఠశాలల హెచ్‌ఎంలు రవీందర్, చంద్రభాను, సొసైటీ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి : ఎంఈవో మనీల

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యం చేరేలా విద్యాభ్యాసం చేయాలని మండల విద్యాధికారి బి.మనీల అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని సీవీ రామన్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రాథమిక తరగతుల స్నాతకోత్సవ (గ్రాడ్యుయేషన్) సర్టిఫికేట్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదివినట్లైతే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లిలో పాదయాత్ర

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

న్యూస్‌నెట్‌వర్క్ : ఏఐసీసీ పిలుపు మేరకు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ నినాదంతో తలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శుక్రవారం జిల్లాలోని పలు గ్రామాల్లో కొనసాగింది. ఈ యాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్‌లో, అక్కన్నపేట నందారంలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం పట్ల బీజేపీ తీరుపై నాయకులు మండిపడ్డారు.

'ఓపెన్' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 26వ వరకు నిర్వహించనున్న ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ఆయా శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఓపెన్ పదో తరగతి పరీక్షను మొత్తం 564 మంది విద్యార్థులు రాస్తుండగా 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షను 896 మంది విద్యార్థులు రాయనుండగా, 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్లను నియమించామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో నాగరాజమ్మ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ మనుచౌదరికి మొక్కను అందజేస్తున్న ఆర్టీఏ సభ్యుడు డాక్టర్ సూర్యవర్మ

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీఏ సభ్యుడు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ఆర్టీఏ (రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ) సభ్యుడిగా ఇటీవలే నియామకమైన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, సిద్దిపేటకు చెందిన డాక్టర్ సూర్యవర్మ శుక్రవారం కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారికి తగినవిధంగా ఉపయోగ పడాలని కలెక్టర్ ఆయనకు ఈ సందర్భంగా సూచించారు. పోలీసులు, ప్రజలకు వారధిలా ఉండాలని కోరారు.

ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం

జిల్లా కార్యదర్శిగా శివలింగ కృష్ణ



గజ్వేల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా శివలింగ కృష్ణ ఎన్నికయ్యారు. సిద్దిపేటలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకోగా, గజ్వేల్‌కు చెందిన శివలింగ కృష్ణ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పలువురికి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ఆందోళన

చేర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం చేర్యాల పట్టణంలోని పలువురు ముస్లిం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుతో తీరని ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తీసుకువచ్చిన బిల్లును ఉపసంహరించాలని కోరారు.

ఉద్యోగ విరమణ వృత్తికి మాత్రమే

● సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగవిరమణ వృత్తికి మాత్రమేనని, వ్యక్తిత్వానికి కాదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. హోంగార్డ్ మహమ్మద్ అబ్దుల్‌రసూల్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సీపీ, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ ఆయనను అభినందించి సన్మానించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ అబ్దుల్ రసూల్ జిల్లాలో హోంగార్డుగా సుదీర్ఘంగా, అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలను పొందారని అన్నారు. శుభాకాంక్షలు తెలియజేస్తూ రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ పత్రాలను ఆయనకు సీపీ అందచేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణికుమార్, ఆర్ఎస్ఐ బాలకృష్ణ, రసూల్ కుటుంబసభ్యులు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల పరిరక్షణ ఉపాధ్యాయులదే

● ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. పవిత్రమైన వృత్తిలో కొనసాగుతున్న ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో ఉండాలని సూచించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తాను కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

అనుబంధ సంఘాల కమిటీల నియామకం



ఎన్నికైన అనుబంధ సంఘాల ప్రతినిధులను అభినందిస్తున్న కాంగ్రెస్ కొమురవెల్లి మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్

చేర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల కమిటీ అనుబంధ సంఘాల నియామకాన్ని శుక్రవారం చేర్యాలలో చేపట్టారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ కమిటీ అధ్యక్షుల వివరాలు వెల్లడించారు. ఓబీసీసెల్ అధ్యక్షుడుగా గొల్లపల్లి శ్రీనివాస్, కిసాన్ సెల్ అధ్యక్షుడుగా బొచ్చు ఎల్లయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడుగా ఎండి.జహంగీర్, సేవాదళ్ అధ్యక్షుడిగా బుడిగె అశోక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా దేవరా రాజలింగం, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాకం ప్రభాకర్, కార్యదర్శిగా సార్ల లింగం, సంయుక్త కార్యదర్శులుగా ములుగు బద్దిరాజు, శిఖ శ్రీనివాస్, కొయడ బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా చుంచు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సంస్థాగత బలోపేతానికి పాటుపడాలని సూచించారు.

పిల్లలు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువుకోవాలి

● అవగాహన కార్యక్రమంలో గజ్వేల్ సీఐ సైదా

గజ్వేల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువుకోవాలని గజ్వేల్ సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మంజీరా కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నివారణ, ట్రాఫిక్ నియమ, నిబంధనలు, ఈవ్‌టీజింగ్, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

ఇసుక డంపును పట్టించిన ఆకునూరు గ్రామస్థులు

చేర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామశివారు వాగులో నుంచి రాత్రివేళల్లో గుట్టుచప్పుడుకాకుండా ఇసుకను తరలిస్తూ జనావాసాల మధ్య డంప్ చేస్తున్నారు. స్థానికులు శుక్రవారం ఇసుక డంపును కనిపెట్టారు. పట్టణ శివారు సుందరయ్యనగర్ కాలనీలో ఇళ్ల మధ్య పలు ట్రిప్పులు డంప్ చేయడాన్ని గమనించి రెవెన్యూ అధికారులకు తెలిపారు. దీంతో తహసీల్దారు సమీర్ అహ్మద్‌ఖాన్ ఆదేశానుసారం సిబ్బంది ఇసుక డంప్‌ను పరిశీలించి సీజ్ చేశారు.

రెండు గ్రామాల విలీనంపై హర్షం

చేర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండల పరిధి నుంచి చేర్యాల పంచాయత్‌రాజ్ పరిధిలోకి రెండు గ్రామాలను విలీనం చేయడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామస్థులు శుక్రవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా ఎన్నోయేళ్ల తమకల సాకారం చేయడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదేచొరవతో తమ గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, నాయకులు కొలుపుల నర్సయ్య, వజ్రోజు శంకరాచారి, లింగంపల్లి చంద్రశేఖర్, కొలుపుల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతన్నకు ఆర్థిక ప్రయోజనం

● గజ్వేల్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతన్నకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని అక్కారం శివారులో రైతు లక్ష్మణ్ సాగు చేసిన ఆయిల్‌పామ్ పంట మొదటి కోతను ఆయన గజ్వేల్ ఏడీఏ బాబునాయక్‌తో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో ఆయిల్‌పామ్ టన్నుకు రూ.21వేలు ఉందని, ప్రభుత్వం ఈ పంట సాగుకు సబ్సిడీని అందిస్తున్నదని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు.

అమ్మవారికి వెండి కవచం బహూకరణ

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలోని అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే దివంగత బొప్పరాజు లక్ష్మీకాంతరావు తనయుడు బొప్పరాజు రాజేశ్వర్‌రావు, జ్యోతిర్మయి దంపతులు శుక్రవారం వెండి కవచాన్ని బహూకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చండీ హోమం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ కిషన్‌రావు, పూజారి పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మల్లయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూతటి మల్లయ్య(56)కు భార్య ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. గత నెల 29న మల్లయ్య చింతచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు దగ్గరలోని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ మల్లయ్య శుక్రవారం మృతి చెందాడు.

మహిళ అదృశ్యం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సింగారంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నలగొండ నరేష్‌రెడ్డి కల్పనను 2019లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. మూడేళ్ల క్రితం నరేష్‌తో గొడవ జరిగి కల్పన పుట్టింటికి వెళ్లింది. కొన్ని రోజుల క్రితం కల్పన తల్లి మృతి చెందడంతో భర్త దగ్గరికి వచ్చి ఉంటుంది. శుక్రవారం ఉదయం చూసేసరికి కల్పన కనబడకపోవడంతో చుట్టుపక్కల వెతికినా సమాచారం లభించలేదు. దీంతో భర్త నరేష్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

బెజ్జంకి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గుండారం గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు శుక్రవారం గౌడ సంఘం సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలోని హుండీని పగలగొట్టి సుమారు రూ. 40 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.